క్లుప్తంగా

విజయసాయిరెడ్డిని కలిసిన కృష్ణచైతన్య



విజయసాయిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: రాజ్యసభ సభ్యుడు, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డిని ఆదివారం రాత్రి ఒంగోలులో రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ సభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డితో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బల్లికురవలో పికెట్



నాలుగు రోడ్ల కూడలిలో పోలీస్ పికెట్

బల్లికురవ: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ప్రధాన నిందితుడుగా టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి అరెస్టు మేరకు బల్లికురవలో ఎలాంటి అలజడులు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఆదివారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సంతమాగులూరు సర్కిల్ సీఐ ప్రభాకర్, ఎస్సై వీ వేమన ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి, టీడీపీ పార్టీ కార్యాలయం ముందు పికెట్ ఏర్పాటు చేశారు. అల్లర్లకు పాల్పపడితే ఎంతటివారిపైనైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనాథలను ఆదుకోవడం మానవతా ధర్మం



వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: అనాథలను ఆదుకోవడం మానవతా ధర్మమని సీనియర్ రోటరీ క్లబ్ సభ్యుడు బండారు పల్లి హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలోని అనాథ వృద్ధ శరణాలయంలో చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, అన్నదానం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ శరణాలయానికి శాశ్వత అన్నదానం కింద రూ. 20 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. క్లబ్ ప్రెసిడెంట్ మామిడాల శ్రీనివాసరావు మాట్లాడుతూ చీరాల రోటరీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ సెక్రటరీ చీరాల కృష్ణమూర్తి అందించిన ఆర్థిక సహకారంతో వృద్ధులకు దుప్పట్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, డీవీ సురేష్, జీవై ప్రసాద్, వీ సుబ్బారావు, చిలుకోటి శ్రీను, పీ శివాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

మౌలాలీకి నాగార్జున యూనివర్శిటీ అవార్డు

అద్దంకి: పట్టణానికి చెందిన పారిశ్రామిక వేత్త సయ్యద్ మౌలాలీకి నాగార్జున యూనివర్శిటీ గ్రామీణ పారిశ్రామిక వేత్త అవార్డును ప్రకటించింది. ఈ మేరకు ఆయనకు యూనివర్శిటీ నుంచి అవార్డు అందుకోవడానికి రావాలని పిలుపు వచ్చింది. ఈ అవార్డును నాగార్జునా యూనివర్శిటీ వ్యవస్థాపక దినోత్సవం అయిన ఈ నెల 11న మౌలాలీతోపాటు వివధ రంగాల్లో కృషిచేసిన వారికి అందించనుంది. దీంతో పట్టణ ప్రముఖులు పెద్దలు సయ్యద్ మౌలాలీకీ అభినందనలు తెలియజేశారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకొవచ్చని సంతమాగులూరు శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిచేత కథలు, దేశనాయకులు చరిత్ర పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. దక్షిణాయణం, నిజ శ్రావణ మాసం, ఆరుద్ర నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



గర్భిణులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వెంకటేష్



కంటి వైద్యశిబిరంలో సేవలను పరిశీలిస్తున్న వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: సమాజ సేవా కార్యక్రమాలు చేస్తూ ఆపన్నులను ఆదుకోవడంతో లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం స్వర్ణ రోడ్డులో లయన్స్ క్లబ్ బిల్డింగ్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులకు సన్మానంతో పాటుగా గర్భిణులకు సామూహిక సీమంతాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన వెంకటేష్ మాట్లాడుతూ.. క్లబ్ అందిస్తున్న సేవ కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, ఆర్యవైశ్య నాయకులు లీలాధర్, రామకృష్ణ, వెంకట గోపాల్, రాఘవేంద్రరావు, సురేష్ తదితరులు ఉన్నారు.

గోమాత దర్శనంతో దోషాలు తొలగుతాయి..

సకల దేవతలు కొలువై ఉన్న గోమాతలను దర్శించుకోవడం, పూజించడం వలన సకల దోషాలు తొలగుతాయని కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాపరాజుతోటలో ఉన్న శ్రీకృష్ణ గోశాలలో గోమాతలకు సీమంతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుడుని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మహిళలతో గోమాతలను ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో శాస్త్రోత్తంగా సీమంతాన్ని జరిపించారు. వేడుకలకు హాజరైన వెంకటేష్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పి.సుబ్బయ్య, గోశాల కమిటీ ప్రతినిధులు దుర్గాకుమార్, సుబ్బారావు, నరసింహారావు, శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన..

పట్టణంలోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో చుండూరి నాగేశ్వరరావు–లలిత దంపతుల సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించిన వెంకటేష్ మాట్లాడుతూ దాతలు సమాజ సేవా కార్యక్రమాలకు తమవంతుగా సహకారం అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. శంకర్ కంటి ఆసుపత్రి ద్వారా వేలాదిమందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు వెంకటేశ్వర్లు, మంజూద్, షాయిదా 445 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభాకరరావు, సుబ్బయ్య, సాంబశివరావు, నిర్వహకులు సురేష్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పాలన

- గడప గడపలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. ఆదివారం చీరాల మున్సిపాలిటీలోని 16 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని వాటిపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అన్ని హామీలను 95 శాతం మేర అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి సారథ్యంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి మరలా సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ జైసన్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు గుంటూరు ప్రభాకరరావు, ఎం.లలిత, మామిడాల రాములు, బత్తుల అనీల్, కంపా అరుణ్, గొట్టిపాటి ఎబినేజర్, ఎం.సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి కోండ్రు బాబ్జి, పార్టీ నాయకులు జి.మాధవరావు, గోలి గంగాధర్, బి.సాంబశివరావు, కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మల్లి రామకృష్ణ, వాసిమళ్ల బ్రదర్స్, బుర్ల సాంబశివరావు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా మిరప సాగు



సంతమాగులూరు మండలంలో నాటిన మిరప



మిరపను పరిశీలిస్తున్న అధికారులు

- నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో సాగు
- మరో 15 వేల ఎకరాల సాగు చేయనున్న రైతులు

అద్దంకి: ఆలస్యంగానైనా వరుణుడు కరుణించడంతో మిరప రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని రైతులు నెల ఆలస్యంగా మిరప పంటను సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే సొంతంగా, షేడ్ నెట్లలో పెంచుకున్న నారును తీసుకుని వచ్చి ప్రధాన పొలంలో నాటే పనిలో ఉన్నారు. సంప్రదాయ పంటల కన్నా వాణిజ్య పంటగా పేరుగాంచిన మిరప పంటను సంతమాగులూరు, జే పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, అద్దంకి మండలాల్లో అత్యధికంగా సాగు చేస్తారు. ఈఏడాది సాగర్ కాలువలో నీరు లేకపోవడంతో బోర్ల కింద పంటను సాగు చేసేందుకు రైతు సిద్ధమయ్యాడు.

ఇప్పటికే ఆలస్యం..

సంతమాగులూరులో అత్యధికంగా 7 వేల ఎకరాల్లో ప్రతి ఏటా సాగు చేస్తుంటారు. ఈఏడు ప్రస్తుతం 2 వేల ఎకరాల్లో ఇప్పటికే నారు నాటారు. అదే విధంగా జే.పంగులూరులో 1500 ఎకరాలు, కొరిశపాడు మండలంలో 500 ఎకరాలు, అద్దంకి మండలంలో 250 ఎకరాలు, బల్లికురవలో 100 నుంచి 150 ఎకరాల్లో పంటను బోర్ల కింద నాటారు. సొంత పొలాల్లో, షేడ్‌నెట్లలో మిరప సాగు చేసే రైతులు విత్తనం ఇచ్చి నారును పెంచుకున్నారు. ఆగస్టులోనే నారు ఏతకు వచ్చినా సరైనా వర్షాలు పడక, వాతావరణం బెట్ట పెట్టడంతో రైతులు నాట్లకు మొగ్గు చూపలేదు. ఏది ఏమైనా ప్రస్తుతం కురిసిన వర్షంతో పంట బెట్ట లేకుండా తట్టుకునే అవకాశం ఉందని, ఎలాగూ వర్షాకాలం కావడం వలన మరో రెండు మూడు వర్షాలు పడే అవకాశం ఉన్నందున వేసిన నాట్లకు ఇబ్బంది ఉండదని తోటలు బాగానే ఉండే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు, రైతులు చెప్పతున్నారు.

వర్షాలు పడి అనుకూలిస్తే డిమాండ్..

వర్షాలు బాగా పడి చీడపీడలు లేకుండా పంట బాగుంటే ఈఏడాది మిరపకు మంచి డిమాండ్ వచ్చే అవకాశం ఉందని రైతులు చెప్పున్నారు. దీంతో రైతులు పంటలు బాగా పండుతాయనే ఆశతో పంటను సాగు చేస్తున్నారు.

రసాయన రహిత పంటలతో ఆరోగ్యం

పర్చూరు (చినగంజాం): రసాయన రహిత పంటలతో అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సీహెచ్ అప్పారావు అన్నారు. ఆదివారం ఆయన 365 రోజులు ఇళ్లల్లోని మహిళలకు ఆదాయం, ఆరోగ్యం పొందేటట్లు 20 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ప్లానింగ్ చేయటంపై అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో ఆకుకూరలు, దుంపజాతి, కాయగూరలు, తీగజాతి, కొత్తిమీర, పండ్ల జాతి అన్ని పండించుకోవచ్చున్నారు. ఆదివారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏటీఎం పద్ధతిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో చేయించారు. ఈ విధానాన్ని అందరూ అవలంభించడం ద్వారా రోగాల బారిన పడకుండా పిల్లలు, పెద్దలు, స్త్రీలు ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లులో..



ఇడుపులపాడులో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న వెంకటస్వామి

రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవటం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని ఇడుపులపాడు గ్రామ పరిధిలో ఉన్నం శేఖర్ 365 కిచెన్ గార్డెన్‌కు ద్రవ జీవామృతం తయారు చేసి అందజేశారు. ఈ సందర్భంగా వెంకట స్వామి మాట్లాడుతూ ద్రవ జీవామృతం వలన భూమిలోని సూక్ష్మజీవులు పెరిగి మొక్కలకు కావాల్సిన పోషకాలు ఇవ్వటం వలన ధృడంగా పెరుగుదలతో పాటు అధిక కాపు వస్తుందన్నారు. రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం కాషాయాలు వాడటం వలన ఆకుకూరలు, కూరగాయలు తినటం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. ద్రవ జీవామృతానికి కావాల్సిన పదార్థాలు ఆవుపేడ 10 కేజీలు, ఆవు మూత్రం 10 లీటర్లు, శనగ పిండి 2 కేజీలు, బెల్లం 2 కేజీలు, గుప్పెడు పుట్టమట్టి తీసుకోవాలని సూచించారు.



పర్చూరులో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న అప్పారావు

ఫిల్టర్ బెడ్ పంపు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న రోటరీ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): తాగునీటికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్లను ప్రారంభించారు. మండలంలోని నాగులపాలెం గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అనుబంధ సంస్థ రోటరీ కమ్యూనిటీ క్రాప్స్, రోటరీ క్లబ్ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌కు ఆదివారం ఫిల్టర్ బెడ్ పంపు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ప్రత్యేకంగా రూ 7 లక్షల అంచనాతో ఫిల్టర్ బెడ్ పంపు నిర్మాణానికి ప్రముఖ ఎన్‌ఆర్‌ఐ ముద్దన హరిబాబు, క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిల్టర్ బెడ్ ఏర్పాటుతో వాటర్ ప్లాంట్‌కు నిరంతరంగా నీరు లభ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీసీ అధ్యక్షుడు చాగంటి నాగేశ్వరరావు, సభ్యులు కొల్లా నాగేశ్వరరావు, శివరామకృష్ణ, నరేంద్ర కుమార్, డైరెక్టర్ తేళ్లరమేష్ చంద్ర, క్లబ్ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోమటి అంజనేయులు, పాబోలు వెంకన్న, పోలిశెట్టి చంద్రం, భవనం రాజగోపాల రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తూనికల్లో తేడాలుంటే చర్యలు



కాటాలను తనిఖీ చేస్తున్న నాగేశ్వరరావు

అద్దంకి: నిత్యావసర వస్తువులు, చికెన్ మటన్, బియ్యం వంటి వాటిని తూచే కాటాల్లో తేడాలుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని బాపట్ల లీగల్ మెట్రాలజీ అధికారి నాగేశ్వరరావు అన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని పలు చికెన్, మార్కెట్ యార్డులోని సంతలో దుకాణాల కాటాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాటాల్లో తేడాలున్నట్లు గమనించి, కాటాల్లో తేడాలున్న పది చికెన్ దుకాణాలు, సంతలో పది కాటాలను పట్టుకుని సీజ్ చేశారు. ఆయా దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ అధికారి మాట్లాడుతూ కాటాలను ముద్ర లేకుండా వాడటం నేరమన్నారు. తక్కువ తూకంతో వినియోగదారులను మోసం చేసిన చట్టం ప్రకారం వారికి శిక్ష పడుతుందని హెచ్చరించారు. తనిఖీల్లో తూనికలు కొలతలు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు



గటం కుండతో గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

బల్లికురవ: శ్రావణమాసం చివరి ఆదివారం సందర్భంగా మండలంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని కొప్పరపాలెం గ్రామంలో కుండతో చద్ది పొంగళ్లు పెట్టి గ్రామోత్సవంగా మహిళలు ఆర్చీకు సమీపంలోని పోలేరమ్మ ఆలయానికి వెళ్లారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించి పొంగళ్లు చద్ది నివేదించారు. గటం కుండతో, గ్రామ పొంగళ్లతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. నక్కబొక్కలపాడు సమీపంలోని ఈర్లకొండకు దిగువ భాగంలోని ఈర్ల గంగమ్మ, బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, వల్లాపల్లి, అంబడిపూడి, కొణిదెన గ్రామాల్లో కూడా గ్రామ దేవతలైన పోలేరమ్మ, అంకమ్మ, మహాలక్ష్మమ్మలకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



క్షతగాత్రులను వైద్యశాలకు తీసుకెళ్తున్న సీఐ సోమశేఖర్

చీరాల టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పోలీసు వాహనంలోనే ఎక్కించుకుని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి టూటౌన్ సీఐ సోమశేఖర్ మానవత్వాన్ని చాటుకున్నాడు. ఆదివారం రేపల్లె మండలం పేటేరుకు చెందిన శ్రీనివాసరావు, శివపార్వతి భార్య భర్తలు బైక్‌పై పేరాల నుంచి వెళ్తున్నారు. ఈక్రమంలో ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టడంతో రోడ్డుపై పడ్డారు. విధుల్లో భాగంగా వాడరేవు రోడ్డులో వెళ్తున్న టూటౌన్ సీఐ సోమశేఖర్ క్షతగాత్రులను పోలీసు వాహనంలో చికిత్స కోసం చీరాల ఏరియావైద్యశాలకు తరలించారు. సకాలంలో స్పందించిన సీఐ గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రులను ప్రాణాపాయం నుంచి కాపాడారని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందందిచారు. ప్రాణాపాయం నుంచి కాపాడిన సీఐను ఎస్పీతో పాటుగా పలువురు అభినందించారు.

కనకయ్య మాస్టారు సేవలు మరువలేనివి



కనకయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రముఖులు

పర్చూరు (చినగంజాం): విద్యాభివృద్ధికి కనకయ్య మాస్టారు ఎనలేని కృషి చేసారని ఏపీ సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శి ఉప్పుటూరి మురళీ కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బీఏఆర్ అండ్ టీఏ జూనియర్ కాలేజీ ఆవరణలో పర్చూరు ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘ వ్యవస్థాపకుడు దివంగత కృష్ణంశెట్టి కనకయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు ప్రాంత విద్యాభివృద్ధికి కనకయ్య మాస్టారు ఎనలేని కృషి చేశారని, అటువంటి వ్యక్తి విగ్రహావిష్కరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మరో ముఖ్య అతిథి కారుమూరి సీతారామయ్య మాట్లాడుతూ కనకయ్య పేద, బడుగు, బలహీన వర్గాల వారికి వెన్నంటి ఉన్నాడని వారి సేవలు కొనియాడదగినవన్నారు. అనంతరం స్థానిక గరల్స్ హైస్కూల్‌లో భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కే రమేష్, అహ్మద్ బాషా, కే హరిబాబు, కొల్లా వెంకటేశ్వర్లు, కృష్ణంశెట్టి పార్వతి, కే రామకోటేశ్వరరావు, పీ ఉదయభాస్కర్, ప్రిన్సిపాల్ చింపారెడ్డి కనకయ్య మాస్టారు కుటుంబ సభ్యులు కే శ్రీనివాసరావు, రవిచంద్ర, కళాశాల సిబ్బంది, గరల్స్ హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.